# ఇండియన్ పాలిటీ

## పార్లమెంటరీ కమిటీలు

**శాసన నిర్మాణ ప్రక్రియ:**

✪ ఆధునిక కాలంలో ప్రభుత్వాల (రాజ్యాల) విధులు విపరీతంగా పెరిగినందువల్ల, పార్లమెంటరీ కమిటీలు లేకపోతే అవి తమ విధులను సంతృప్తికరంగా నెరవేర్చలేవు.

✪ 'ఆడంబరాల మధ్య జరిగే పార్లమెంట్ సమావేశాల స్థానంలో కమిటీల సమావేశాలకు ఎక్కువ సమయం కేటాయించడం వల్ల, ఉపయోగకరమైన పని జరిగి, ప్రజలకు మేలు చేకూరుతుంది' అని హిరేన్ ముఖర్జీ (రాజ్యసభ మాజీ సభ్యుడు) అభిప్రాయపడ్డారు.

✪ ఈ కమిటీల వల్ల పార్లమెంట్ సభ్యుల్లో వీలైనంత ఎక్కువ మందికి ప్రభుత్వ పాలనారంగ వ్యవహారాల్లో కావాల్సినంత పరిజ్ఞానం వస్తుంది.

### సాధారణ కమిటీలు

1. **సభా వ్యవహారాల కమిటీ:** లోక్‌సభ, రాజ్యసభలకు విడివిడిగా ఉంటుంది. లోక్‌సభ కమిటీలో 15 మంది సభ్యులు, రాజ్యసభ కమిటీలో 11 మంది సభ్యులుంటారు. స్పీకర్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తారు.

✪ సభా కార్యక్రమాలకు కాల నిర్ణయ పట్టికను రూపొందించడం, చర్చనీయాంశాలకు సమయాన్ని కేటాయించడం మొదలైనవి ఈ కమిటీ విధులు.

2. **సభా హక్కుల సంఘం:** లోక్‌సభ కమిటీలో 15 మంది, రాజ్యసభ కమిటీలో 10 మంది సభ్యులుంటారు. సభా మర్యాదలను, సభ్యుల హక్కులను కాపాడటానికి ఈ కమిటీ తోడ్పడుతుంది.

✪ స్పీకర్ రూలింగ్‌ను ఖాతరు చేయకపోవడం, సభ్యుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం మొదలైన వాటి వల్ల సభా మర్యాదలకు భంగం కలిగినట్లు తీర్మానిస్తే, వాస్తవాలను పరిశీలిస్తారు. ఒకవేళ సభా మర్యాదలకు భంగం కలిగినట్లు నిర్ధారణ అయితే ఈ కమిటీ శిక్షలను సిఫారసు చేస్తుంది.

3. విజ్ఞాపన కమిటీ
4. ప్రభుత్వ హామీల కమిటీ
5. షెడ్యూల్డ్ కులాలు, తెగల సంక్షేమ సంఘం
6. ప్రైవేటు మెంబరు బిల్లు కమిటీ
7. రూల్స్ కమిటీ
8. ఎథిక్స్ కమిటీ
9. మహిళా సాధికార కమిటీ
10. డిపార్ట్‌మెంటల్ స్టాండింగ్ కమిటీ
11. సంప్రదింపుల కమిటీ
12. సభ్యుల గైర్హాజరు కమిటీ
13. లాభదాయక పదవుల కమిటీ
14. గ్రంథాలయ కమిటీ
15. సాధారణ ప్రయోజనాల కమిటీ

✪ 24 స్టాండింగ్ కమిటీలు ఉంటాయి. లోక్‌సభ ఆధ్వర్యంలో 16, రాజ్యసభ ఆధ్వర్యంలో 8 పనిచేస్తాయి.

- ప్రతి కమిటీలో 31 మంది సభ్యులుంటారు, లోక్‌సభ నుంచి 20 మంది, రాజ్యసభ నుంచి 11 మంది ఉంటారు.
- వీరి పదవీకాలం ఒక సంవత్సరం. మంత్రులు ఈ కమిటీలో సభ్యులుగా ఉండకూడదు.
- వివిధ మంత్రిత్వ శాఖల పద్దులు, బిల్లులను పరిశీలించడం ఈ కమిటీల ముఖ్యమైన విధి.

## ఆర్థిక కమిటీలు

**1. ప్రభుత్వ ఖాతాల సంఘం (Public Accounts Committee):**

- ఈ కమిటీలో 22 మంది సభ్యులు సంవత్సర కాలానికి ఎన్నికవుతారు.
- లోక్‌సభ నుంచి పదిహేనుమందిని, రాజ్యసభ నుంచి ఏడుగురిని ఎన్నుకుంటారు. మంత్రులు సభ్యులుగా ఉండకూడదు.
- 1967 నుంచి ప్రతిపక్ష పార్టీ నాయకుడిని ఈ సంఘానికి అధ్యక్షుడిగా నియమిస్తున్నారు.
- ప్రస్తుత అధ్యక్షుడు కె.వి. థామస్.
- కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్, ఆడిట్ నివేదికల ఆధారంగా ప్రభుత్వ శాఖల పనితీరును పరిశీలిస్తారు. బడ్జెట్‌లో నిర్ణయించిన ప్రకారం ఖర్చు జరిగిందీ, లేనిదీ పరిశీలించి అవకతవకలుంటే తెలియజేయడం ఈ కమిటీ విధి.
- ఆర్థిక వ్యవహారాల్లో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పడానికి ఈ సంఘం సహకరిస్తుంది.

**2. అంచనాల సంఘం (Estimates Committee):** ఈ సంఘాన్ని 1950లో ఏర్పాటుచేశారు.

- 30 మంది లోక్‌సభ సభ్యులను నిష్పత్తి ప్రాతినిధ్యం ద్వారా సభ్యులుగా ఎన్నుకుంటారు. మంత్రులు సభ్యులుగా ఉండకూడదు.
- కమిటీ పదవీ కాలం ఒక సంవత్సరం.
- అంచనాల సంఘానికి ప్రస్తుత అధ్యక్షుడు మురళీ మనోహర్ జోషి.
- బడ్జెట్ అంచనాలను పరిశీలించి, పొదుపు చర్యలను సిఫారసు చేయడం, ప్రభుత్వ నిధులను వివిధ శాఖల మధ్య సక్రమంగా పంపిణీ చేయడానికి సూచనలివ్వడం ఈ సంఘం ముఖ్య విధులు.

**3. ప్రభుత్వ రంగ సంస్థల సంఘం (Public Undertakings Committee):**

- ఈ కమిటీ ప్రస్తుత అధ్యక్షుడు శాంతకుమార్. దీనిలో 22 మంది సభ్యులుంటారు. పదిహేను మందిని లోక్‌సభ నుంచి, ఏడుగురిని రాజ్యసభ నుంచి నిష్పత్తి ప్రాతినిధ్యం ద్వారా ఎన్నుకుంటారు.
- పదవీకాలం 5 సంవత్సరాలు.
- ప్రభుత్వం జాతీయం చేసే సంస్థలు, ప్రభుత్వం నిర్వహించే సంస్థల తనిఖీ ఈ సంఘం ముఖ్య విధి.

## శాసన నిర్మాణ ప్రక్రియ

- పరిపాలనకు అవసరమైన శాసనాలను రూపొందించడం పార్లమెంట్ ప్రధాన విధి. బిల్లు రూపంలో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి, వివిధ దశల్లో చర్చించి, అవసరమైన మార్పులు, చేర్పులు చేసి, ఉభయ సభలు ఆమోదించిన తర్వాత రాష్ట్రపతి ఆమోదంతో శాసనాలుగా అమలు అవుతాయి.
- రాజ్యాంగంలోని 107 నిబంధన నుంచి 122 నిబంధన వరకు శాసన నిర్మాణానికి సంబంధించిన విషయాలను తెలియజేస్తాయి.
- కేంద్ర జాబితా, ఉమ్మడి జాబితాలోని అంశాలపై పార్లమెంట్ శాసనాలు చేయవచ్చు.
- బిల్లులను వాటిని ప్రవేశపెట్టిన వారిని బట్టి, ప్రభుత్వ బిల్లు, ప్రైవేట్ మెంబరు బిల్లు అని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు.
- ప్రభుత్వ శాఖల మంత్రులు బిల్లును ప్రవేశపెడితే దాన్ని ప్రభుత్వ (పబ్లిక్) బిల్లు అంటారు.
- పార్లమెంట్ సభ్యులు (మంత్రులు కానివారు) ఏ పార్టీకి చెందినవారైనా ప్రవేశపెట్టిన బిల్లును ప్రైవేట్ మెంబరు బిల్లు అంటారు.
- ఏ కారణంతోనైనా ప్రభుత్వం వ్యతిరేకించిన ప్రైవేట్ బిల్లును పార్లమెంట్ ఆమోదిస్తే ప్రభుత్వం రాజీనామా చేయవలసి ఉంటుంది.

- 1953 నుంచి పార్లమెంట్ సమావేశ కాలంలో ప్రతి శుక్రవారం చివరి రెండు గంటలు ప్రైవేట్ మెంబరు బిల్లును పరిశీలనకు కేటాయిస్తారు.
- 1978లో ఆలీఘర్ ముస్లిం యూనివర్సిటీ బిల్లు, 2015లో 3rd జండర్ (మాడా హక్కులు) బిల్లు (ఇవి ప్రైవేటు మెంబరు బిల్లులు) ప్రభుత్వ సహకారంతో ఆమోదం పొందాయి.
- బిల్లులోని అంశాలను బట్టి సాధారణ, ఆర్థిక, రాజ్యాంగ సవరణ బిల్లు అని వర్గీకరించవచ్చు.
- రాజ్యాంగ సవరణ, ద్రవ్య సంబంధం లేని బిల్లులను సాధారణ బిల్లులు అంటారు.
- సాధారణ బిల్లును ఏ సభలోనైనా ప్రవేశపెట్టవచ్చు. రాష్ట్రపతి పూర్వానుమతి అవసరంలేదు. ఒక సభ ఆమోదించిన బిల్లును రెండో సభకు పంపుతారు. ఆరు నెలల వ్యవధిలో రెండో సభ ఆమోదించడమో, ఏవైనా మార్పులు చేయడమో, తిరస్కరించడమో చేయవచ్చు.
- సాధారణ బిల్లు చట్టంగా మారడానికి ఈ కింది దశల్లో పార్లమెంట్‌లో చర్చిస్తారు.
- బిల్లులో పెట్టాల్సిన అంశాలపై ఆయా మంత్రిత్వ శాఖను, న్యాయ మంత్రిత్వ శాఖను, అటార్నీ జనరల్‌ను సంప్రదించి 'ముసాయిదా' తయారు చేస్తారు. ముసాయిదా మంత్రిమండలి ఆమోదం పొందిన తర్వాత సంబంధిత మంత్రి వారం రోజుల ముందుగా నోటీసు ఇచ్చి, సభాధ్యక్షుడి అనుమతితో ఏ సభలోనైనా ప్రవేశపెట్టవచ్చు.
- సంబంధిత మంత్రి సభాధ్యక్షుడు నిర్ణయించిన తేదీన ఆ బిల్లు లక్ష్యం, ఉద్దేశం, బిల్లు శాసనమైతే కలిగే ప్రయోజనాలను వివరించి ప్రవేశపెట్టడానికి అనుమతిని కోరతారు.
- **ప్రథమ పఠనం:** బిల్లు ప్రవేశపెట్టడానికి అనుమతి లభించిన తర్వాత సంబంధిత మంత్రి బిల్లు శీర్షిక, ఉద్దేశం, అంశాలను సభకు తెలియజేస్తారు. తర్వాత ప్రభుత్వ రాజపత్రం (గెజిట్)లో ప్రచురిస్తారు. ఇది బిల్లు ప్రథమ దశ. ఈ దశలో చర్చలను అనుమతించరు.
- **ద్వితీయ పఠనం:** స్పీకర్ నిర్ణయించిన తేదీన బిల్లుపై సాధారణ చర్చ జరుగుతుంది. సంబంధిత మంత్రి బిల్లులోని వివిధ అంశాలపై వివరణ ఇచ్చి, చట్టంగా ఆమోదించాల్సిన అవసరాన్ని తెలియజేస్తారు.
- అప్పుడు బిల్లును వెంటనే సభలో పరిశీలించడం లేదా కమిటీకి నివేదించడం లేదా సంయుక్త నిర్ణాయక కమిటీకి పంపడం లేదా ప్రజాభిప్రాయం కోసం ప్రచార సాధనాల ద్వారా ప్రజలకు తెలియజేయడంలో ఏదో ఒకటి నిర్ణయిస్తారు.
- **కమిటీ దశ:** ఏర్పాటు చేసిన కమిటీ సంయుక్త కమిటీ అయితే లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు 2 : 1 నిష్పత్తిలో ఉంటారు.
- ఏ సభలో బిల్లు మొదట ప్రవేశపెడితే ఆ సభాధ్యక్షుడు, కమిటీ అధ్యక్షుడిని నియమిస్తారు. ఈ కమిటీ బిల్లులోని అన్ని అంశాలనూ పరిశీలించి సభకు నివేదిస్తుంది.
- **నివేదన దశ:** కమిటీ నుంచి వచ్చిన తర్వాత బిల్లులోని అంశాలపై సభలో చర్చిస్తారు. ప్రతి అంశాన్నీ కూలంకషంగా చర్చించి, సభ ఆమోదంతో అవసరమైన సవరణలు (మార్పులు, చేర్పులు) చేస్తారు.
- **తృతీయ పఠనం:** ఈ దశలో బిల్లును ఆమోదించాల్సిందిగా ప్రవేశపెట్టిన సభ్యుడు ప్రతిపాదిస్తారు.
- ఎక్కువ చర్చ జరగదు కానీ, సవరణలు ప్రతిపాదించవచ్చు. అవసరమనుకుంటే అధ్యక్షుడి అనుమతితో ఓటింగ్ జరిపించి, సభ ఆమోదం పొందిన తర్వాత ఆ బిల్లును రెండో సభకు పంపుతారు.
- రెండో సభలో పైన పేర్కొన్న దశల్లో బిల్లును చర్చించి ఆ సభ కూడా ఆమోదిస్తే, అప్పుడు బిల్లును రాష్ట్రపతి వద్దకు పంపుతారు.
- ఒక సభ ఆమోదించిన బిల్లును, రెండో సభ కొన్ని సవరణలు చేసి తిరిగి ప్రవేశపెట్టి, సభకు పంపవచ్చు లేదా తిరస్కరించవచ్చు.
- రెండో సభ బిల్లును ఆమోదించకుండా, తిరస్కరించకుండా 6 నెలలు గడిస్తే తిరస్కరించినట్లుగా భావిస్తారు. ఆ విధంగా ఉభయసభల మధ్య అభిప్రాయ భేదం ఏర్పడితే సంక్షోభ నివారణ కోసం రాష్ట్రపతి ఉభయ సభల ఉమ్మడి సమావేశం ఏర్పాటు చేస్తారు. ఉమ్మడి సమావేశానికి లోక్‌సభ స్పీకర్ అధ్యక్షత వహిస్తారు.
- ఇంతవరకు 1961లో వరకట్న నిషేధం బిల్లు, 1979లో బ్యాంకింగ్ సంస్కరణల బిల్లు, 2002లో పోటా బిల్లు విషయంలో ఇలాంటి ఉమ్మడి సమావేశాలు జరిగాయి.



www.eenadupratibha.net

- రాజ్యాంగ సవరణ, ద్రవ్య బిల్లుల విషయంలో ఉమ్మడి సమావేశాల ఏర్పాటుకు వీలులేదు.
- పార్లమెంట్ ఉభయ సభలు ఆమోదించిన బిల్లును రాష్ట్రపతి ఆమోదానికి పంపుతారు. రాష్ట్రపతి ఆ బిల్లును

  **1.** వెంటనే ఆమోదించవచ్చు

  **2.** నిరాకరించవచ్చు

  **3.** కొన్ని సూచనలతో పునఃపరిశీలనకు పంపవచ్చు.
- రాష్ట్రపతి సూచనలతో వెనక్కి వచ్చిన బిల్లును పార్లమెంట్ తిరిగి ఆమోదించి రాష్ట్రపతికి పంపిస్తే, అప్పుడు రాష్ట్రపతి ఆ బిల్లును 'తప్పక ఆమోదించాలి'.
- రాజ్యాంగ నిబంధన 111లో బిల్లును రాష్ట్రపతి వీలైనంత త్వరగా ఆమోదించాలని తెలియజేశారు కానీ కాల పరిమితి విధించలేదు. కాబట్టి రాష్ట్రపతి 'పాకెట్ వీటో' ఉపయోగించవచ్చు.
- రాజ్యాంగం 110వ నిబంధన ప్రకారం ఈ కింది అంశాలున్న బిల్లును ద్రవ్య బిల్లుగా పరిగణిస్తారు.
- ఏవైనా కొత్త పన్నులు విధించడం, పాతవి రద్దు చేయడం, మార్చడం లాంటి అంశాలు.
- ప్రభుత్వ రుణాల క్రమబద్ధీకరణ.
- భారత సంఘటిత నిధి సంచిత కేటాయింపులు.
- భారత సంఘటిత నిధి నుంచి కొత్తగా ఖర్చు చేసే అంశాలు.
- ప్రజాధనానికి వచ్చే ఆదాయం, వ్యయాలపై ఆడిట్.
- పైన పేర్కొన్న తత్సంబంధిత అంశాలు బిల్లులో ఉంటే, ద్రవ్య బిల్లుగా లోక్‌సభ స్పీకర్ ధ్రువీకరిస్తారు. స్పీకర్ నిర్ణయమే తుది నిర్ణయం. ద్రవ్య బిల్లులను ముందుగా లోక్‌సభలోనే ప్రవేశపెట్టాలి. అలాంటి బిల్లులు లోక్‌సభలో ప్రవేశపెట్టడానికి రాష్ట్రపతి పూర్వానుమతి ఉండాలి.
- లోక్‌సభ ఆమోదించిన ద్రవ్య బిల్లు రాజ్యసభకు పంపిన తర్వాత 14 రోజుల్లోపు రాజ్యసభ ఆమోదించాలి. రాజ్యసభలో చేసిన సవరణలను లోక్‌సభ ఆమోదించవచ్చు, తిరస్కరించవచ్చు.
- 14 రోజుల తర్వాత రాష్ట్రపతి ఆమోదానికి పంపుతారు. ద్రవ్య బిల్లు విషయంలో లోక్‌సభ అధికారం తిరుగులేనిది. ద్రవ్య బిల్లును ఆమోదించడంలో రాష్ట్రపతి జాప్యం చేయకూడదు. పునఃపరిశీలనకు పంపకూడదు. ఉమ్మడి సమావేశానికి కూడా వీలులేదు.
- **ఆర్థిక బిల్లు:** రాజ్యాంగ నిబంధన 117 ప్రకారం ఒక బిల్లులో ప్రభుత్వ ఆదాయ, వ్యయాలకు సంబంధించిన అంశాలుంటే 'ఆర్థిక బిల్లు' అంటారు. వీటిని స్పీకర్ ధ్రువీకరించాల్సిన అవసరం లేదు.
- నిబంధన 110లోని అంశాలతోపాటు ఇతర అంశాలు ఉన్న బిల్లులను మొదటి తరగతి ఆర్థిక బిల్లులుగా పరిగణిస్తారు.
- ఈ బిల్లు ముందుగా లోక్‌సభలోనే ప్రవేశపెట్టాలి. రాష్ట్రపతి పూర్వానుమతి కూడా ఉండాలి. మిగిలిన అన్ని విషయాల్లో సాధారణ బిల్లుల విషయంలో రాజ్యసభకు లభించే అధికారాలు ఈ సభకు ఉంటాయి.
- ఒక సాధారణ బిల్లు ఖర్చులకు సంబంధించిన విషయాలు కూడా (నిబంధన 110లోని అంశాలు మినహా) ఉన్నట్లయితే దాన్ని రెండో తరగతి ఆర్థిక బిల్లుగా పరిగణిస్తారు. దీన్ని ఏ సభలోనైనా ప్రవేశపెట్టవచ్చు. ఉభయసభలకు సమాన అధికారాలుంటాయి.
- ఆధునిక కాలంలో పార్లమెంట్ కార్యక్రమాలు పటిష్ఠంగా, సమర్థంగా నిర్వహించడానికి, నివేదికలను విపులంగా చర్చించడానికి కమిటీ పద్ధతి అవసరం.
- పార్లమెంటరీ కమిటీల ద్వారా బిల్లుల పూర్వాపరాలు, మంచి చెడ్డల గురించి విస్తృతంగా చర్చిస్తారు. కమిటీల సూచనలతో పార్లమెంట్‌లో చర్చ అనంతరం సకాలంలో ఆమోదింపజేస్తారు.

**రచయిత: మెరుపుల నారాయణమూర్తి**